ప్రజల రక్షణ కోసమే పోలీసులు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ప్రజల రక్షణ కోసమే పోలీస్ వ్యవస్థ పని చేస్తుందని జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లోని స్పందన హాల్లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు.

బాలలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం

- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగస్వాములవుదాం
- రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణువర్ధన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బాలల హక్కులను పరిరక్షించి బంగారు భవిష్యత్తును అందించడంతో పాటు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (సీఆర్‌ఏఎఫ్), జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం–బాలల హక్కులు రక్షిద్దాం, దత్తత ద్వారా తల్లిదండ్రులు–బాలల హక్కు పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బాలల హక్కుల చట్టాలను సమర్థంగా అమలు చేసినప్పుడే చిన్నారులకు బంగారు భవిష్యత్తును అందించగలుగుతామన్నారు. బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నప్పటికీ ఇంకా అక్కడక్కడ కొన్ని ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. బాలల హక్కులు, చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అడిషనల్ డీసీపీ వెంకటరత్నం మాట్లాడుతూ బాలలతో పనిచేయించే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి మాట్లాడుతూ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడంతో పాటు బాలల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, ఎస్సీపీసీఆర్ మెంబర్ రాజేంద్రప్రసాద్, దిశ ఏసీపీ వీవీ నాయక్, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ డైరెక్టర్ ఫ్రాన్సిస్, ఐసీడీఎస్ సీడీపీవోలు జి.మంగమ్మ, కె.నాగమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్, సీవీఆర్ హైస్కూల్, వీఎం రంగా బాలికల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

కోహాన్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ రూ. 38 లక్షలు ఆర్థిక సహాయం


కలెక్టర్ ఢిల్లీరావుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను, కోహాన్స్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీబీ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు కోహాన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.38 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించింది. విజయవాడలో జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఇందుకు సంబంధించిన చెక్కును సంస్థ ప్రతినిధులతో కలిసి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు అందజేశారు. టీబీ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ముక్త్యేశ్వరపురంలో ఉన్న కోహాన్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ ముందుకు రావడం అభినందనీయ మని కలెక్టర్ అన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడు కార్పొరేట్ సంస్థలు అందిస్తున్న సహకారం,కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో 3 వేల మందికి పైగా టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించామని, వీరిలో 700 మంది నిరుపేదలకు ప్రధానమంత్రి టీబీ ముక్తిభారత్ అభియాన్ పథకం కింద రూ.500 నగదు, పౌష్టికాహారం, మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. దీంతో పాటు జిల్లా అధికారులు 100 మందికి ఒక్కొక్కరికి నెలకు రూ.700 విలువ గల పోషకాహార కిట్లను ఆర్నెల్లపాటు అందజేశారన్నారు. 2025 నాటికి జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమన్నారు. కలెక్టర్‌కు చెక్కును అందించిన వారిలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, కనెక్ట్ ఆంధ్ర సీఈఓ కె.శివశంకర్, కోహాన్స్ లైఫ్‌సైన్సెస్ హెడ్ ఎంఎస్ఎన్ రెడ్డి, వీఎస్ఎన్ మూర్తి, జీఎం బాలాజీ మహేష్ ఉన్నారు.

రేపటి నుంచి ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటు


లోగో ఆవిష్కరిస్తున్న పోస్ట్ మాస్టర్ జనరల్ మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సందేశ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ శాఖలో పనిచేస్తున్న సిబ్బందిలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు 39వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని విజయవాడ రీజియన్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్వీఆర్ మూర్తి చెప్పారు. కృష్ణలంకలోని చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ ఏపీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం టోర్నమెంట్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం మూర్తి మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదీ నుంచి పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. పురుషులు, మహిళల సింగిల్స్, డబుల్స్‌తో పాటుగా వెటరన్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. అసాం, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హరియాణ, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది ఈ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. విజేతలకు 26వ తేదీ బహుమతులను అందజేస్తామన్నారు. పోస్టల్ సర్వీసెస్ (హెడ్ క్వార్టర్) డైరెక్టర్ సందేశ్ మహదేవప్ప కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి భవానీ మండల దీక్షలు

- 26న కోటి దీపోత్సవం
- డిసెంబర్ 13 నుంచి అర్ధమండల దీక్షలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఈనెల 23వ తేదీ గురువారం నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంద్రకీలాద్రిపై నిర్వహించే ఉత్సవాలలో రెండో అతి పెద్ద ఉత్సవమైన భవానీ దీక్షలకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. 23 నుంచి ఐదు రోజుల పాటు భక్తులు అమ్మవారి మండల దీక్షలను స్వీకరిస్తారు. దీక్ష స్వీకరణ కార్యక్రమాన్ని దేవస్థానం ఎంతో వైభవంగా నిర్వహిస్తుంది. గురువారం ఉదయం అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి పగడాలతో చేసిన దండను అలంకరిస్తారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రధాన ఆలయం నుంచి మహా మండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకొస్తారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అఖండ జ్యోతి ప్రజ్వలనతో దీక్ష స్వీకరణ మహోత్సవం లాంఛనంగా ప్రారంభమవుతుంది. అమ్మవారి ఆలయంతో పాటు ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద, గురు భవానీల పీఠంలోనూ భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరిస్తారు.

26న కోటి దీపోత్సవం

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం వెలిగిస్తారు. 27వ తేదీ ఉదయం 5:55 గంటలకు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ జరుగుతుంది.

13 నుంచి అర్ధమండల దీక్షలు

డిసెంబర్ 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు భక్తులు అమ్మవారి అర్ధమండల దీక్షలను స్వీకరిస్తారు. ఇక డిసెంబర్ 26వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి కలశజ్యోతి మహోత్సవం విజయవాడ సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి ప్రారంభమవుతుంది. దీక్ష విరమణలు వచ్చే ఏడాది జనవరి 3వ తేదీన ప్రారంభమై జనవరి 7వ తేదీ వరకు కొనసాగుతాయి. 3వ తేదీ ఉదయం మహామండపం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసే హోమగుండాలలో అగ్నిప్రతిష్ఠాపనతో దీక్ష విరమణలు ప్రారంభమవుతాయి. జనవరి 7వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో నిర్వహించే పూర్ణాహుతితో దీక్ష విరమణలు పరిసమాప్తమవుతాయి.

అర్ధరాత్రి ఇంటిపైకి దూసుకెళ్లిన లారీ

- తప్పిన పెనుప్రమాదం
- ఇంటి గోడలు సామగ్రి ధ్వంసం
- గాజుల పేట వద్ద ఘటన


గాజుల పేట వద్ద ధ్వంసమైన రేకులషెడ్డు ఇంటి గోడలు, సామగ్రి

ఇబ్రహీంపట్నం: స్థానిక రింగ్ సెంటర్ సమీపంలో గాజులపేట వద్ద 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ఇంటిపైకి ఆదివారం అర్ధరాత్రి టిప్పర్ లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. అయితే ఇంటిగోడలు, సామగ్రి ధ్వంసమయ్యాయి. గాజులపేటకు చెందిన పైలా జమలమ్మ తన ఆరుగురు కుటుంబ సభ్యులతో కలసి జాతీయ రహదారి పక్కన రేకుల షెడ్డులో ఉంటున్నారు. వీరు లారీలకు లోడింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తారు. అందులో భాగంగా కుటుంబంలోని ఐదుగురు సభ్యులు రాత్రి లోడింగ్ పనికి వెళ్లగా, మిగిలిన ఒక కుమారుడు ఇంటి లోపల నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో విజయవాడ వైపు నుంచి కంచికచర్ల వైపు వెళ్తున్న పది టైర్ల టిప్పర్ లారీ ఇంటి పైకి దూసుకువెళ్లింది. కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉండి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు టిప్పర్ లారీని అక్కడ నుంచి తొలగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరమేశ్వరుడికి విశేష అభిషేకం


గంపలగూడెంలో రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చక స్వామి

గంపలగూడెం: కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పలు శివాలయాల్లో పరమేశ్వరుడికి అభిషేకం, అర్చన చేశారు. గంపలగూడెం గంగా పార్వతీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, నెమలి శివాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో భక్తులు పాల్గొన్నారు. పెనుగొలను శివాలయంలో మృత్యుంజయ సహితరుద్ర హోమం నిర్వహించారు. అర్చకులు బాలాంత్రపు వెంకటేష్ శర్మ, దాములూరు రామలింగేశ్వర శర్మలు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు.

శివాభిషేకం

మైలవరం: స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీకోదండ రామాలయంలో కార్తిక సోమవారం పురస్కరించుకుని కేదారేశ్వర్ నుంచి తీసుకొచ్చిన శివలింగానికి ఆలయ అర్చకులు మాధవ శర్మ ఆధ్వర్యంలో భక్తులు అభిషేకం నిర్వహించారు.

తిరువూరులో..

తిరువూరు: పట్టణంలోని దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరాలయం, చంద్రమౌళీశ్వరాలయం, గౌరీ కేదారేశ్వరాలయాల్లో తెల్లవారుజాము నుంచే పూజలు నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి


మృతి చెందిన లెహన్య

పెనమలూరు: కానూరులో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఎస్‌బీఐ కాలనీకి చెందిన కొమ్మినేని సుబ్బారావుకు భార్య ఇద్దరు పిల్లలు. ఆయన ఖమ్మంలో ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తాడు. కుమార్తె లెహన్య(16) విజయవాడలో నారాయణ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె కుడి చేయి లాగటం వలన అనారోగ్యంతో సరిగా చదవలేక పోతోంది. ఈ నెల 17వ తేదీన కాలేజీలో ఉండగా జ్వరం రావటంలో టాబ్లెట్ వేశారు. మరల 18న కూడా అనారోగ్యంగా ఉండటంతో లెహన్యను కానూరులో ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చూపించారు. అయితే ఆదివారం రాత్రి ఒక్కసారిగా ఆమె ఆరోగ్యం క్షీణించటంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకు వెళ్లారు. అక్కడ లెహన్య మృతి చెందింది. ఆమె మరణంపై తండ్రి సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వటంతో కేసు నమోదు చేశారు. ఆమె మరణానికి కారణం తెలియలేదు. పోస్టుమార్టం రిపోర్టు రావల్సి ఉంది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి


ఏ.కొండూరు తండాలో సంక్షేమ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని ఏ.కొండూరు తండాలో సోమవారం పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమం డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ నాగలక్ష్మి, , జెడ్పీటీసీ సభ్యుడు భూక్య గనియా, సర్పంచ్ సావిత్రి, నాయకులు చెన్నారావు, వెంకటరెడ్డి, వెంకయ్య, సతీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్య

రైలు కింద పడి బలవన్మరణం


ఆత్మహత్యకు పాల్పడిన పావని, రాకేష్ (ఫైల్)

గూడూరురూరల్ (తిరుపతి జిల్లా): విజయవాడలోని కోచింగ్ సెంటర్లో కుదిరిన స్నేహం విడదీయరాని బంధంగా మారింది. పెద్దలు ఎక్కడ తమను కలుసుకోకుండా చేస్తారో అన్న భయంతో ఆ జంట గూడూరుకు సమీపంలో ఆదివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా శ్రీరుక్మిణిపురానికి చెందిన అన్నంగి పావని (19) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసింది. చిల్లకూరు మండలంలోని ఓ హోటల్‌లో పని చేసేందుకు సొంత ఊరి నుంచి తల్లిదండ్రుల అనుమతి తీసుకుని రెండు రోజుల క్రితం వచ్చింది. అక్కడ నుంచి తనకు గతంలో విజయవాడ లోని కోచింగ్ సెంటర్‌లో చదువుకుని ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా సగిపాడు గ్రామానికి చెందిన దండే రాకేష్(23)ను గూడూరుకు రావాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. దీంతో ఆదివారం అతను గూడూరు వచ్చాడు. ఇద్దరూ కలుసుకుని చాలా సేపు మాట్లాడుకున్నారు. అనంతరం తమ ప్రేమ పెద్దలకు ఇష్టం లేకపోతే ఇద్దరూ దూరం కావాల్సి వస్తుందని భావించిన వారు ఒకరిని విడిచి ఒకరు ఉండలేక గూడూరు రైల్వే స్టేషన్ నుంచి సుమారు మూడు కిమీ దూరంలో ఉన్న గాంధీనగర్ ప్రాంతం వరకు ట్రాక్‌పై నడిచి వెళ్లి అక్కడ రైలు పట్టాలపై పడుకున్నారు. వారిపై నుంచి గూడ్స్ ట్రైన్ వెళ్లడంతో తలలు తెగి వారు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ సంఘటన గూడూరు డివిజన్‌లో సంచలనం సృష్టించింది. యువతీ యువకుల మృతదేహాలను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సోమవారం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ బిడ్డల మృతదేహాలను చూసి వారిరువురి తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా


నాగులూరులో విద్యుత్ సబ్ స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

నాగులూరు(రెడ్డిగూడెం): గ్రామీణ ప్రాంతాలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాను చేయాలనే ప్రధాన ధ్యేయంతో విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం మండలంలోని నాగులూరు గ్రామంలో రూ. 2.7 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, ఈ ప్రాంత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యానారాయణ, విజయవాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వసంతరావు, అసిస్టెంట్ ఇంజినీర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో ఉత్సాహంగా రెజ్లింగ్ పోటీలు


విజేతలతో ఎస్ఆర్ఆర్ కళాశాల సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళలు, పురుషుల రెజ్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి ప్రారంభించారు. పోటీలలో ఎస్ఆర్ఆర్ కళాశాలతో పాటు పీబీ సిద్ధార్థ కళాశాల, వికాస్ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, నున్న, కేబీఎస్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన వివిధ వెయిట్ కేటగిరీలలో ఎస్కే ఖాశిం బాషా, కె.హరిశంకర్, కె.అజయ్, సీఎస్ సాయి తేజ తదితరులు విజేతలుగా నిలిచారు. విజేతలు చండీగఢ్‌లో నిర్వహించే రెజ్లింగ్ పోటీలలో కృష్ణా యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ విద్య విభాగాధిపతి మండవ కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ అభినందించారు.

నైపుణ్యాలను పెంపొందించేందుకు నూతన విద్యా విధానం

మైలవరం: నూతన విద్యా విధానం–సమగ్ర అభివృద్ధి జరగడంతో ప్రత్యేకంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే విధంగా, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండేట్లు సూచించారని ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎల్‌కే మోహనరావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక వృద్ధి, సామాజిక రంగం అనే అంశంపై సోమవారం ఒక రోజు సదస్సు జరిగింది. సదస్సులో ప్రొఫెసర్ మోహనరావు మాట్లాడుతూ సత్వర ఆర్థికాభివృద్ధి సాధించడంలో సేవారంగం కీలకమైనదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, అసోసియేషన్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ కే. అప్పారావు ప్రసంగించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను విడుదల చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గొల్లపూడి గ్రంథాలయంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకట్ అధ్యక్షత వహించిన ఈ సభలో స్థానిక స్వాతి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ పెద్దిరెడ్డి కాకాని సాంబశివరావు, రైల్వే విశ్రాంత ఉద్యోగి చాంద్ బాషా, గొల్లపూడి శాఖ గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెండి కిరీటం అందజేత



విస్సన్నపేట: స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో స్వామికి విస్సన్నపేటకు చెందిన సంగెపు అనంతబాబు, రమణాజీ దంపతులు రూ.లక్ష విలువజేసే వెండికిరీటాన్ని సోమవారం అందజేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల సమక్షంలో వెండికిరీటం, నూతన వస్త్రాలను అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సూరాయపాలెం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు సూరాయపాలెం ఏరియా, సిరి ఐకానిక్ టవర్స్, కృష్ణ కరకట్ట ఏరియా వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తిరువూరు: సత్యసాయి జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక కోకిలంపాడు రోడ్డులోని సత్యసాయి సేవాసమితిలో సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సేవాసమితి సభ్యులు నగర సంకీర్తన చేసిన అనంతరం పేదలకు దుప్పట్లను వితరణ ఇచ్చారు. దంత వైద్యనిపుణుల లక్ష్మణరావు, సాయిసేవాసమితి కన్వీనర్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

పెద్దకొమిర(గంపలగూడెం): మండలంలోని పెద్దకొమిరకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పాపినేని లక్ష్మీనారాయణ(80) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటున్న ఆయన ఇంటి వద్ద మృతి చెందారు.

కార్తిక శోభ

ఆగిరిపల్లి: కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక శోభను సంతరించుకుంది. స్థానిక సత్రం సెంటర్లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

ఆలయాలు కిటకిట

నూజివీడు: కార్తిక మాసం మొదటి సోమవారం పట్టణంలోని శివాలయాలు భక్తులతో తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. రైతుబజారు రోడ్డులోని శివాలయం, బస్టాండు వద్ద ఉన్న శివాలయంలు మహిళలతో కిక్కిరిశాయి.

ముసునూరు: బలివేలోని ప్రసిద్ధ బలే రామ స్వామి ఆలయంలో త్రిలోచనునికి అమృత వేళ భక్తులు అభిషేకం, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఈటకొండలరావు పాల్గొన్నారు.

రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



రాఘవాపురంలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

రెడ్డిగూడెం: విత్తు నుంచి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించే వరకు రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు ఉపయోగపడుతున్నాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం-2 సచివాలయం పరిధిలో రూ. 21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరసా కేంద్ర భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్బీకేల ఏర్పాటుతో వ్యవసాయం రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఈ-క్రాప్ బుకింగ్, రైతు సంక్షేమ పథకాల అమలులో ఆర్బీకేలు పారదర్శకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రెడ్డిగూడెం గ్రామంలో గత నాలుగున్నర ఏళ్లలో పేదల సంక్షేమం సుమారు రూ. 60కోట్లు చెల్లించగా, గత ప్రభుత్వంలో ఐదేళ్లలో రూ. 5 కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. కరోనా సమయంలో కూడా సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కొన్ని చోట్ల రహదారులు బాగోలేదని, వాటన్నింటినీ ప్రాధన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర రహదారులు, జిల్లా రహదారుల పునరుద్ధరణకు రూ. 4,325 కోట్లు ఖర్చు చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రోడ్ల పునరుద్ధరణకు రూ. 7,340 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ తిరుపతి రావు, ఎంపీపీ దేవి ప్రవణ్య, సచివాలయ మండల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, రెడ్డిగూడెం మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రాబర్టు, రెడ్డిగూడెం సర్పంచ్ రాణీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నాగులూరు(రెడ్డిగూడెం): ఇది ప్రజల ప్రభుత్వం, ప్రజా సంక్షేమమే ఈ ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి పనులను కూడా ప్రాధాన్యతా క్రమంలో చేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. నాగులూరులో రూ. 25లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. తొలుత నాగులూరులో వీవీరోడ్డు నుంచి సాయన్నపాలెం వరకు రూ. 2.96కోట్లతో నిర్మించిన బీటీ, సిమెంట్ రహదారిని ప్రారంభించారు.

గ్రామీణాభివృద్ధికి నిధుల మంజూరు

ఎమ్మెల్యే రక్షణనిధి



చింతలపాడులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి

చింతలపాడు(తిరువూరురూరల్): గ్రామీణాభివృద్ధికి అవసరమైన నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు తిఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరు మండలం చింతలపాడులో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ప్రతి గ్రామంలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకేలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల్లోనే అందుబాటులోకి తెచ్చామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నాలుగున్నరేళ్లలో అభివృద్ధిని వివరిస్తూ డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నారాయణరావు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి అర్జీలను సంబంధిత అధికారులు గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్ ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో స్పందన కార్యక్రమానికి వచ్చి అర్జీలను ఇస్తున్నారని, వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అధికారులు పరిష్కరించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్‌వై నూరాణి, హెచ్‌వో రాజులపాటి హేమ, డీఎల్‌డీఓ వెంకటరత్నం పాల్గొన్నారు.

'స్పందన'లో మూడు అర్జీలు

గంపలగూడెం: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు, మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ సాయి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

జి.కొండూరు: ఎటువంటి వివక్షకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసిన నాయకులు, గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. కేడీసీసీ డైరెక్టర్ రవీంద్ర రాణా, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు బ్రహ్మయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ రాంబాబు, సర్పంచ్ అరుణ పాల్గొన్నారు.

కొండపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఐదో సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం సాయంత్రం జరిగింది. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాల్టీ వైఎస్సార్ సీపీ కన్వీనర్ మిక్కిలి శరభయ్య, మున్సిపాల్టీ సచివాలయాల కో-ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు పాల్గొని పేదలకు సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు కావాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని సూచించారు. సంక్షేమ అభివృద్ధి పథకాలు, లబ్ధిదారులతో కూడిన డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు.

సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్

నూజివీడు: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 4వ వార్డు సచివాలయంలో సోమవారం సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరాలను తెలిపే బోర్డును వైస్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో రూ.17.15 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం వార్డులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, చంటి, కొండూరు కృష్ణవేణి, శాంతకుమారి పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

నరసాపురం (విస్సన్నపేట): పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. మండలంలోని నరసాపురం గ్రామసచివాలయం-1 పరిధిలో పల్లెకు పోదాం, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డును ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నరసాపురం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు ఆవిష్కరించారు. సచివాలయ మండల కన్వీనర్ శివబాజీ, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: గ్రామాల స్వయం సమృద్ధి లక్ష్యంగా జగనన్న పల్లెకు పోదాం కార్యక్రమం అని జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా బలివే సచివాలయం వద్ద ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఎంపీపీ ప్రారంభించారు. సర్పంచ్ రావు ప్రవీణ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ రాజానాయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీటీసీ దాసి రాటాలు, బలివే దేవస్థాన చైర్మన్ నాగేశ్వరరావు, నాయకులు జలగం శేషు, రావు సుధాకర్, వెంకట్రావు పాల్గొన్నారు.

సమర్థవంతమైన పాలన జగన్‌కే సాధ్యం

పెద్దకొమిర(గంపలగూడెం): సమర్థవంతమైన పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యం అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. గంపలగూడెం మండలం పెద్దకొమిరలో సోమవారం రాత్రి పల్లెకుపోదాం, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు చెన్నకేశవరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

నూజివీడు: అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లని, ఒకవైపు పేదల సంక్షేమానికి కృషి చేస్తూనే మరోవైపు రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అన్నారు. మండలంలోని హనుమంతులగూడెంలో పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, సర్పంచ్ మల్లయ్య, సచివాలయాల కన్వీనర్ శాంతకుమార్ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: ప్రజా సంక్షేమ పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జనార్దనవరం సచివాలయంలో సోమవారం నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయం పరిధిలో పలు సంక్షేమ పథకాల ద్వారా రూ.16.63 కోట్లు లబ్ధి పొందారని చెప్పారు. సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డుని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి ఏపీకి జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమం చేపట్టి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా తీర్పుని సేకరించారు. సర్పంచ్ ఝాన్సీ, ఎంపీటీసీ కృష్ణ, మాజీ సర్పంచ్ నాగేశ్వరావు, పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు

ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు హెచ్‌ఎం ఆదిశేషు సోమవారం తెలిపారు. పి.లక్ష్మీనరసింహారావు, ఎం అనంతరామయ్య జ్ఞాపకార్థం దాతలు ఈ పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు చెన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు పుల్లారావు, దాతలు వి. సుధా ప్రసాద్, ఎం.ఫణికుమార్, ఎం. మురళీకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్లెకు పోదాం కార్యక్రమం

ఆగిరిపల్లి: పల్లెకి పోదాం కార్యక్రమాన్ని కనసానపల్లిలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరరావు తెలిపారు. దీనిలో సచివాలయం పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేసే బోర్డును ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

గొల్లపల్లిలో..

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి సచివాలయం -2 పరిధిలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. సాయంత్రం మూడు గంటలకు సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

నూజివీడు: హెచ్ఐవీ అనేది అంటువ్యాధి కాదని, ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ వ్యాప్తిపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్‌వర్కర్స్ స్కీం జిల్లా రిసోర్స్ పర్సన్ లక్ష్మీనాయక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో సోమవారం సుంకొల్లు, యనమదలలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ సుందరరావు, సుంకొల్లు సర్పంచ్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చాట్రాయి: ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుందని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని బూరుగుగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వ్యవసాయ అధికారి శివ శంకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

తిరువూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎంఈఓ-2 రామకృష్ణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షల మెటీరియల్‌తో పాటు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని భరతకుమారి, తెలుగుభాషా వికాససమితి కన్వీనర్ ఉమామహేశ్వరరావు, గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

పెనుగొలను(గంపలగూడెం): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సంగెపు లలిత విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రంథాలయ అధికారి శ్రీలత పాల్గొన్నారు. గంపలగూడెం శాఖ గ్రంథాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్పంచ్ పుల్లమ్మ బహుమతులు అందజేశారు. గ్రంథాలయ నిర్వాహకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో వారం రోజులుగా వివిధ విభాగాలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. గ్రంథాలయాధికారి విజయకృష్ణ పాల్గొన్నారు.

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా గంథాలయంలోని అమూల్యమైన గ్రంథాలు చదువుతూ నాగరికత, మానవతా విలువలు, సంస్కృతిని తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్, బాలకృష్ణారావు, హరినారాయణ పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: గ్రంథాలయాలు సరస్వతీ దేవి నిలయాలు, విజ్ఞాన సారస్వత సంపద అని సర్పంచ్ కంచర్ల వాణి, వైస్ ఎంపీపీ పాముల గంగాధర్ అన్నారు. మండలంలోని గోపవరం గ్రంథాలయ అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో హైస్కూల్ హెచ్.ఎం నాగేంద్రరావు అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారిప్రసన్న పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి తెలిపారు. గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నాగిరెడ్డి, టి. సురేష్‌బాబు, ఎల్బీఆర్‌సీఈ గ్రంథాలయ పాలకులు సాంబశివరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బి.దాసు, గ్రంథాలయ సిబ్బంది నాగార్జున, సయ్యద్ అహ్మద్, రాంబాబు, కీర్తి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆధునిక దేవాలయాలు

నూజివీడు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ అన్నారు. వారంరోజులుగా పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పగడాల సత్యనారాయణ వారోత్సవాల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, ఎంటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో నిర్వహించిన వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేసారు. గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని ఎంపీపీ మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ రాణి పాల్గొన్నారు.